క్లుప్తంగా

జాబ్‌మేళాలో 92 మంది ఎంపిక



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

మందమర్రిరూరల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ దేవానంద్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. పలు సంస్థల నిర్వాహకులు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి 92మందిని ఎంపిక చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. టాటా ఏయిరోస్పేస్, ఎస్‌పీఎం ప్రైవేట్ లిమిటెడ్, వోల్వో ఇందారం, ఆదర్శ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల నిర్వాహకులు అభ్యర్థులను ఎంపిక చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వివిధ సంస్థల నిర్వాహకులు, ఐటీఐ కళాశాల సిబ్బంది ఉన్నారు.

వేతనాలు చెల్లించాలి

పాతమంచిర్యాల: జిల్లాలోని ఎస్సీ డెవలప్‌మెంట్ వసతి గృహాల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ వర్కర్లకు వేతనాలు చెల్లించాలని వర్కర్లు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 6 నెలలుగా తమకు ప్రభుత్వం వేతనాలు చెల్లించడం లేదని, దీంతో కుటుంబాల పోషణ భారంగా మారిందని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి వేతనాలు వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో అవుట్‌సోర్సింగ్ వర్కర్లు వెంకటేష్, విజయ, సునీత, ప్రమీల, లత, భాగ్య, రమా, అమృత, శారద, రాజేశ్వరీ, గంగరాజమ్మ, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి బ్రహ్మానందం పాల్గొన్నారు.

గుడిపేటలో దరఖాస్తుల పరిశీలన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట గ్రామంలో 58, 59జీఓ కింద సోమవారం భూముల క్రమబద్ధీరణకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. హాజీపూర్ మండల ప్రత్యేకాధికారి రవీందర్ రెడ్డి, నాయబ్ తహసీల్దార్ హరిత, మండల సర్వేయర్ కృష్ణప్రియ, గిర్దావర్ మంగల ఆధ్వర్యంలో 58, 59 కింద దరఖాస్తు చేసుకున్న వారి భూములను క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షించారు. గ్రామంలో 88దరఖాస్తులు రాగా ఇప్పటివరకు 60దరఖాస్తుల వరకు పరిశీలించారు. ప్రభుత్వ భూముల్లో ఇళ్ల నిర్మాణాలు చేసుకున్న వారి భూముల క్రమబద్ధీరణకు సంబంధించి దరఖాస్తుదారుల వివరాలను విచారించారు.

రేపు దివ్యాంగులకు రుణాల కోసం ఇంటర్వ్యూలు

భీమారం: జిల్లా సంక్షేమ శాఖ ద్వారా దివ్యాంగులకు స్వయం ఉపాధికోసం మంజూరు చేయనున్న రుణాల కోసం ఈ నెల 13న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీ సేవా ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు మధ్యాహ్నం 12:30నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

బీఎల్‌వో విధులపై అవగాహన



అంగన్‌వాడీ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీవో

దండేపల్లి: బీఎల్‌వో విధులపై తహసీల్దార్ కార్యాలయంలో మంచిర్యాల ఆర్డీవో రాములు ఐకేపీ సిబ్బందికి సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు సమ్మెలో ఉండటంతో, వారు నిర్వహించే విధులకు ఆటంకం కలగకుండా ఉండేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ టీచర్లు నిర్వహించే బీఎల్‌వోల విధులను ప్రత్యామ్నాయంగా ఐకేపీ సిబ్బంది నిర్వహించాలని సూచించారు. బీఎల్‌వోల విధులపై తగిన అవగాహన కల్పిస్తామని, ఆ విధులను వారు సమ్మె విరమించే వరకు ఐకేపీ సిబ్బంది చేపట్టాలన్నారు. తహసీల్దార్ సంధ్యారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి, ఐకేపీ ఏపీఎం బ్రహ్మయ్య, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



దండేపల్లి: శ్రీరాంపూర్‌లో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో దండేపల్లి మండల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు డ్రాగన్ స్వార్డ్ కుంగ్‌ఫూ అకాడమీ ఫౌండర్ బొడ్డు రాజమల్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారిలో కాగిత సామ్య, సిద్ది సాయి ఉన్నారు. కార్యక్రమంలో కోచ్ సిద్ది చందు పాల్గొన్నారు.



దండేపల్లి: అంగన్‌వాడీల రిలే దీక్షలో మాట్లాడుతున్న రంజిత్



తాండూర్: నినాదాలు చేస్తున్న కార్యకర్తలు

అంగన్‌వాడీ టీచర్ల సమ్మె

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

బెల్లంపల్లి: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బెల్లంపల్లి ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు నిరవధిక సమ్మె చేపట్టారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ సంఘం(సీఐటీయూ) ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు విధులు బహిష్కరించారు. వీరికి సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. వక్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, గ్రాడ్యుటీ అమలు చేసి రిటైర్డుమెంట్ బెనిఫిట్స్, పెన్షన్‌ను పెంచాలని డిమాండ్ చేశారు. సమ్మెలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమణ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ సంఘం జిల్లా అధ్యక్షురాలు రాజమణి, కార్యదర్శి అనురాధ, నాయకులు రాధాబాయి, పద్మావతి, మంగావతి, భారతి, రాజేశ్వరి, సంగీత, వెంకటలక్ష్మీ, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దేవదాసు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దండేపల్లి: అంగన్‌వాడీల డిమాండ్లు తీర్చాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా దండేపల్లిలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సోమవారం చేపట్టిన రిలే దీక్షకు ఆయన మద్దతు తెలిపారు.

జన్నారం: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ టీచర్లు సమ్మెబాట పట్టారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మె ప్రారంభించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సరస్వతి, రాజేశ్వరి, కృపా, లక్ష్మి, బుచ్చమ్మ, నస్రీన్, స్వర్ణలత, విజయలక్ష్మి పాల్గొన్నారు.

నెన్నెల: ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు నిరవధిక సమ్మె చేపట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు రాజేశ్వరి, చంద్రకళ, సబిత, విజయలక్ష్మీ, సువర్ణ, సరళాదేవి పాల్గొన్నారు.



జన్నారం: సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

తాండూర్: సమ్మె డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు దాగం రాజారాం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర అంగన్‌వాడీ వర్కర్స్,హెల్పర్స్ సంఘం చేపట్టిన సమ్మెకు మద్దతు తెలిపారు.

కాసిపేట: అంగన్‌వాడీ టీచర్ల సమ్మెకు ఏఐటీయూసీ, సీఐటీయూ సంఘాలు మద్దతు ప్రకటించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్, మండల కార్యదర్శి దాగం మల్లేష్, ఏఐటీయూసీ నాయకులు పోశం, గట్టు సర్వేశం, రాజలింగు వారికి మద్దతుగా నిలిచి సమస్య ప్రభుత్వం పరిష్కరించనట్లయితే ఆందోళనను ఉధృతం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు మురళి, రాజయ్య సంఘీభావం తెలిపి మద్దతు ప్రకటించారు.

సమ్మెలో 'బామ్మ'



నెన్నెల: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మెలో 90ఏళ్ల బామ్మ పాల్గొంది. ఈ బామ్మ పేరు పర్వ రాజమ్మ. ఈమె జోగాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో 40 ఏళ్లుగా ఆయాగా పని చేస్తోంది. అంగన్‌వాడీలలో రిటైర్డ్‌మెంట్ లేకపోవడంతో తొమ్మిది పదుల వయస్సులోనూ ఆయాగా విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పింది.

సమ్మెలో పాల్గొనడం లేదు...

మంచిర్యాలటౌన్: ఈ నెల 11 నుంచి ప్రారంభమయ్యే అంగన్‌వాడీ టీచర్స్ అండ్ వెల్ఫేర్స్ యూనియన్ సమ్మెలో తాము పాల్గొనడం లేదని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ వెల్ఫేర్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.సురేఖ తెలిపారు. ఈ సందర్భంగా సమ్మెకు వెళ్లడం లేదనే విషయాన్ని ప్రాజెక్ట్ ఆఫీసర్ సీడీపీవో విజయలక్ష్మి, యూడీసీ రాజేందర్‌లకు వినతిపత్రం ద్వారా తెలిపారు. మా యూనియన్ బీఆర్‌ఎస్ పార్టీకి అనుబంధంగా, బీఆర్‌టీయూ ట్రేడ్ యూనియన్‌కు అనుబంధంగా ఉందని, వినతిపత్రాల ద్వారా ప్రభుత్వానికి తమ సమస్యలను తెలియజేస్తున్నామన్నారు.



వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

చెన్నూర్: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ పాల్గొనుట లేదంటూ సీడీపీవో మనోరమకు వినతిపత్రం అందజేసినట్లు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి రాథోడ్ సత్యవతి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శారద, రాజేశ్వరి, ప్రవీణ, మహతి, మంగమ్మ, మణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలో సోమవారం పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ప్రారంభించారు. మోదెల బెస్తవాడలో గంగపుత్ర సంఘం కమ్యూనిటీ భవనం గొల్లగూడెంలో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.పది లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, నూతనంగా మంజూరైన ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్, పట్టణాధ్యక్షుడు శ్రీనివాస్, కౌన్సిలర్లు చాత రాజు రాజన్న, సురేష్ అధికారులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. గుడిపేటలో పాఠశాల ప్రహరీ, అంగన్‌వాడీ కేంద్రంలోని వంటగదిని ప్రారంభించారు. పెద్దంపేట, బుద్దిపల్లి, నంనూర్–గుడిపేట, పడ్తనపల్లిలోని రాంపూర్‌లలో హైమాస్ట్ లైటింగ్ సిస్టమ్‌ను ప్రారంభించారు. పెద్దంపేటలోని కొలాంగూడ గిరిజనుల రాకపోకల కోసం బ్రిడ్జ్‌ను ప్రారంభించారు. కార్యక్రమాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మొగిళి శ్రీనివాస్, జీవన్‌రావు, ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కార్మికులకు యూనిఫాం పంపిణీ

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలో పని చేస్తున్న 370మంది మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు యూనిఫాంలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, మున్సిపల్ కమిషనర్ మారుతి, కాంట్రాక్ట్ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు సుదమల హరికృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్ మాదంశెట్టి సత్యనారాయణ, ప్రకాశ్‌నాయక్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



ఎన్నికైన రెనోవేషన్ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే

ఆలయ రెనోవేషన్ కమిటీ సభ్యులకు సత్కారం

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని విశ్వనాథ ఆలయ రెనోవేషన్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దివాకర్‌రావు ప్రకటించారు. విశ్వనాథ ఆలయ కాలక్షేప మండపంలో సోమవారం సభ్యుల అభినందన (పరిచయ) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులుగా ముఖేష్, బ్రహ్మయ్య, లచ్చన్న, వోడ్నాల రవీందర్, శృతి, జాడి కళ, అంజయ్యయాదవ్, బాలరాజు, సుధాకర్, రాజబాబురెడ్డి, సురేందర్, రాజేశం, రామగిరి రాజబాబు, ఓం ప్రకాశ్‌ను శాలువాలతో సత్కరించారు.

పనికి తగ్గ వేతనాలు చెల్లించాలని ధర్నా

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్‌హెచ్‌ఎం స్కీమ్‌లో పనిచేస్తున్న కార్మికులను రెగ్యూలర్ చేసి సమానపనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు ఎందుకు పెంచడం లేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. కార్మికులను రెగ్యూలర్ చేస్తానన్న మాట నిలబెట్టుకోవాలని, వెంటనే రెగ్యూలర్ చేసి సమానపనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో లింగం రమాదేవి, పోచన్న, బాపు, మోహన్‌రాజ్ కుమార్, శివ, ధనలక్ష్మి, సరితా, భారతి, రాజమణి, విజయలక్ష్మి, స్రవంతి, మహేందర్, సురేఖ, పావని, మధు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఉద్యోగులు, నాయకులు

పరిహారం అందించాలని కలెక్టరేట్ ముట్టడి

మంచిర్యాలఅగ్రికల్చర్: హాజీపూర్ మండలం ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు బాధితులకు నష్టపరిహారం అందించాలని బీజేపీ ఆధ్వర్యంలో ముంపు బాధితులు సోమవారం కలెక్టరేట్ ముట్టడించారు. ముందస్తుగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయగా బాధితులు, బీజేపీ నాయకులు రెండు గంటల పాటు కలెక్టర్ రావాలని కలెక్టరేట్ గేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. లోపలికి అనుమతించకపోవడంతో కలెక్టరేట్ గేటు దొబ్బుకొని లోపలకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడం ఒకరిని ఒకరు తోసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మరోవైపు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ తగలబెట్టేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు వినతిపత్రం అందజేశారు. బాధితులు అదనపు కలెక్టర్‌తో పరిహారం రావడం లేదని తమ గోడును వెల్లబోసుకున్నారు. నెలరోజుల్లో సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు బాధితులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న బాధితులు, బీజేపీ నాయకులు

సంక్షిప్త వార్తలు

సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

మంచిర్యాలఅర్బన్: సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, కనీస వేతన స్కేలు అమలు చేయనందుకు నిరసనగా సమ్మెకు వెళ్లినట్లు సమగ్రశిక్ష ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం డీఈవో యాదయ్యకు వినతిపత్రం అందజేశారు.

కాంగ్రెస్‌లో చేరికలు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల నుంచి మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కమ్యూనిటీ కాంటాక్ట్

వేమనపల్లి: అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం అందించాలని నీల్వాయి ఎస్సై సుబ్బారావు అన్నారు. మండలంలోని ఒడ్డుగూడంలో సోమవారం పోలీసు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు.

సన్మానం

పాతమంచిర్యాల: నూతనంగా ఎన్నికైన మంచిర్యాల క్రెడాయి బిల్డర్ అసోసియేషన్ సభ్యులను సోమవారం జిల్లా కేంద్రంలో ప్లంబర్ అసోసియేషన్ నాయకులు సన్మానించారు.

ఎంవీటీసీలో రక్తదాన శిబిరం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని పాలచెట్టు వద్ద గల గనుల వృత్తి శిక్షణ కేంద్రం (ఎంవీటీసీ)లో సోమవారం సింగరేణి ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఏరియా ఎస్వోటు జీఎం రాజేశ్వరరెడ్డి హాజరై ప్రారంభించారు. 117మంది యువ కార్మికులు రక్తదానం చేశారు.

ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం

మంచిర్యాలటౌన్: పట్టణంలోని మిమ్స్ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా వనితా వాక్కు ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

గుంతలో పడి లేగదూడ మృతి

భీమిని: కన్నెపల్లి మండలంలోని ఎంపీపీఎస్ పాఠశాల ఆవరణలో నీటి సంపు పక్కకు ఉన్న గుంతలో పడి సోమవారం లేగదూడ మృతి చెందింది. 'మన ఊరు–మనబడి'లో భాగంగా మంచినీటి సంపును ఏర్పాటు చేసి, దాని పక్కకు ఉన్న గుంతను పూడ్చివేయకపోవడంతో అందులో నీరు చేరి ప్రమాదకరంగా మారింది. అటు వైపుగా వెళ్లిన లేగదూడ అందులో పడి మృతి చెందింది.

'ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి'

రామకృష్ణాపూర్: సంక్షేమ గురుకులాలతో పాటు ఆయా ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న సుమారు రూ.2లక్షల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను సోమవారం కరీంనగర్‌లో కలిసి వినతిపత్రం అందించినట్లు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నాయకుడు మెడపట్ల సతీష్ తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

తాండూర్: చట్టాల గురించి విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని బెల్లంపల్లి జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జె.ముకేష్ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ విద్యాలయంలో సోమవారం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు.

హామీలు నెరవేర్చాలని దీక్ష

తాండూర్: రేచినీ గ్రామపంచాయతీ ప్రజలకు ఇచ్చిన హామీలను ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య వెంటనే నెరవేర్చాలని తాండూర్ మండల బీజేపీ అధ్యక్షుడు మహీధర్ గౌడ్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట రేచినీ గ్రామ శక్తికేంద్రం భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శన

భీమారం: ప్రతి విద్యార్థికి సైన్స్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకే జిజ్ఞాస సంచార ప్రయోగశాల నిర్వహిస్తున్నామని జిల్లా సైన్స్ అధికారి మధు పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని ఆరెపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రయోగ శాలలో ఆయన మాట్లాడారు. హెడ్మాస్టర్ రవీందర్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు ప్రారంభం



నస్పూర్: బైక్‌ర్యాలీలో పాల్గొన్న సీపీఐ నాయకులు



మందమర్రిరూరల్: జెండా ఆవిష్కరిస్తూ...



బెల్లంపల్లి: అమరులకు జోహార్లు అర్పిస్తున్న కామ్రేడ్స్

నస్పూర్: ఈ నెల 11నుండి 17వరకు నిర్వహించే తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణ శంకర్ పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట 75వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలో సీపీఐ నిర్వహించిన బైక్ ర్యాలీని సీసీసీ కార్నర్ వద్ద శంకర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ నెల 17న హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే తెలంగాణ సాయుధ పోరాట అమరుల సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, మండల సహాయ కార్యదర్శి లింగం రవి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, నాయకులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: తెలంగాణ రైతాంగ సాయుధ గెరిల్లా పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర చెరగని సంతకమని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) నాయకులు అన్నారు. బెల్లంపల్లి సాయుధ పోరాట వార్షికోత్సవాలను సోమవారం ప్రారంభించారు. సీపీఐ కార్యాలయం, భగత్‌సింగ్ విగ్రహం వద్ద సీనియర్ నాయకుడు చిప్ప నర్సయ్య ఎర్రజెండాను ఎగుర వేశారు. తెలంగాణ సాయుధ పోరాట అమరులకు కమ్యూనిస్టులు విప్లవ జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి చంద్రశేఖర్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బొల్లం పూర్ణిమ, జిల్లా సమితి సభ్యులు జీసీ మాణిక్యం, అక్కెపల్లి బాపు, ఎల్తూరి శంకర్, బి.లక్ష్మీనారాయణ, కొంకుల రాజేష్, మేకల రాజేశం, రత్నం రాజం, గంగారాం, రాంచందర్, స్వామి దాస్, శంకర్, భరత్, శ్రీనివాస్, రాంనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: తెలంగాణ సాయుధ పోరాట అమరులను తెలంగాణ ప్రభుత్వం మరిచిందని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశారు. వారోత్సవాల్లో భాగంగా మందమర్రిలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. అమరుల త్యాగం వల్లనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాకారమైందన్నారు. ఏఐటీయూసీ కార్యాలయం నుంచి మార్కెట్ పుర వీధుల గుండా అబ్రహం స్థూపం వరకు నాయకులు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అబ్రహం స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ పట్టణ కార్యదర్శి కామెర దుర్గరాజ్ సీపీఐ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కాసిపేట: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను పురస్కరించుకొని కాసిపేట మండల కేంద్రంలో సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి దాగం మల్లేష్, సీనియర్ నాయకులు పోశం, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పోశం, నాయకులు రాజలింగు, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు భూమి పంపిణీ చేయాలి

జన్నారం: మండలం చింతగూడ గ్రామ శివారులోని సర్వే నంబర్ 81/ఆ లోని ప్రభుత్వ భూమిని భూమిలేని నిరుపేదలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఎం ఎల్ ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీతో తహసీల్దార్ కార్యాలయం వరకు చేరుకుని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రజాపంథా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు నంది రామయ్య, మంచిర్యాల జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్, పీవోడబ్ల్యూ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రమాదేవి, నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీ తీస్తున్న సీపీఐ ప్రజాపంథా నాయకులు

ధర్నాతో ఇబ్బందులు

- అదనపు కలెక్టర్ కాలినడక

మంచిర్యాలఅగ్రికల్చర్: ఓ దిక్కు గంటల తరబడి ధర్నా.. మరో దిక్కు మధ్యాహ్న భోజన సమయం ఇక వేచి ఉండలేక కలెక్టరేట్ పక్కదారి కాలిబాట గుండ వెళ్తున్న బైకులు బురదతో జారి పడగా.. మరోదిక్కు వాహనం కలెక్టరేట్ లోపల ఉండడంతో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ నడుచుకుంటూ వెళ్లారు. జిల్లా సమీకృత కలెక్టరేట్ ఎదుట గేట్ వద్ద సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో ఎల్లంపల్లి ముంపు బాధితులు పరి హారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. కలెక్టరేట్ ఏవో వచ్చి వినతి పత్రం తీసుకునేందుకు ప్రయత్నించగా కలెక్టర్ వచ్చి వినతిపత్రం తీసుకోవాలని బాధితులు భీష్మించుకు కూర్చున్నారు. పోలీసులు బందోబస్తుతో లోపలి నుంచి బయటకు, బయట నుంచి లోపలకి వెలకుండా గేటు మూసి వేశారు. మధ్యాహ్నం భోజన సమయం కావడంతో కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది, అర్జీదారులు గంటల తరబడి నీరసించారు. కార్లు, బైకులు కలెక్టరేట్ ఆవరణలో క్యూ కట్టాయి. కొంతమంది వాహనదారులు కలెక్టరేట్ పక్కన మట్టిగడ్డలు, ఒడ్లు మీదుగా బయటకు వెళ్లే ప్రయత్నం చేశారు. బురద ఒడ్లు ఉండడంతో బైకులు జారీ పడ్డాయి. ఒకరికి ఒకరు సాయం చేసుకుంటూ అతికష్టం మీద బయటకు వెళ్లారు. కలెక్టర్ ఇతర కార్యక్రమంలో ఉండడంతో అదనపు కలెక్టర్ మోతిలాల్ ముంపు బాధితుల వద్దకు వచ్చి ఫిర్యాదులు తీసుకున్నారు. బాధితులు ఆందోళన చేయడం, అదనపు కలెక్టర్ వాహనం కలెక్టరేట్ లోపల ఉండడంతో బాధితుల మధ్య నుంచి ఒక్కరే మెయిన్‌రోడ్డు వైపు 400మీటర్ల వరకు నడువసాగారు. తదనంతరం వాహనం రావడంతో ఎక్కి మంచిర్యాల వైపు వెళ్లారు.



కలెక్టరేట్ పక్కదారిన వెళ్తున్న ప్రయాణికులు



నడుచుకుంటూ వెళ్తున్న మోతిలాల్